www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023
5
చిత్తూరు




నేడే... వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

- భవనాన్ని ప్రారంభించనున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
- ముఖ్యఅతిథిగా ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి హాజరు
- 'సమతా స్వాప్నికుడు వేమన ' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న విరపు
- ముస్తాబైన పలవలి రామకృష్ణారెడ్డి, ఎజి యతిరాజుల సభామందిరాలు
- వేమన పద్యభావ చిత్రలేఖనం ఎగ్జిబిషన్ , నృత్యరూపకం ప్రదర్శన



ప్రజాశక్తి- తిరుపతి

'భూమిలోనబుట్టు భూసారమెల్లను.... తనువులోనబుట్టు తత్వమెల్ల.... శ్రమలోనబుట్టు సర్వంబుతానౌను' అంటూ 350 ఏళ్ల క్రిందటే శ్రమ విలువను ఎంతో గొప్పగా ఆవిష్కరించి, శ్రమతత్వాన్ని చాటిన ప్రాత:స్మరణీయుడు వేమన అందించిన విజ్ఞానాన్ని నేటితరానికీ విస్తరించారన్న ధృఢసంకల్పంతో తిరుపతి కేంద్రంగా ఏర్పాటైన 'వేమన విజ్ఞానకేంద్రం' నేడు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. కరోనా కాలం నుంచే పలు సామాజిక, సేవా, సాంస్కతిక, చైతన్య పూరిత కార్యక్రమాలను తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న ఆ వేమన విజ్ఞాన కేంద్రం ఇకపై సకల కళలకు కేంద్రంగా భాసిల్లనుంది. తిరుపతి, యశోదనగర్‌లో ఏర్పాటైన ఈ నూతన భవనాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. దీనికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ పాత్రికేయులు, సామాజిక విశ్లేషకులు తెలకపల్లి రవి హాజరై ఈ సమాజానికి వేమన చేసిన సేవలను, చూపిన మార్గాన్ని వివరించనున్నారు. అలాగే 'సమతా స్వాప్నికుడు వేమన' పుస్తకాన్ని మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త విఠపు బాలసుబ్రమణ్యం ఆవిష్కరించనున్నారు. ప్రముఖ మార్క్సిస్టు నేత, మదనపల్లికి చెందిన న్యాయవాది పలవలి రామకష్ణారెడ్డి పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పలవలి కుసుమకుమారి ప్రారంభించనున్నారు. ప్రముఖ అభ్యుదయ అనువాద రచయిత ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన భార్య ఏజీ చంద్రమ్మ ప్రారంభించి తిరుపతి వాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'వేమన పద్యభావ చిత్రలేఖనం' ఎగ్జిబిషన్‌ను అతిథులు ప్రారంభించి, వేమన నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారు. అనంతరం నిర్వహించనున్న సభకు తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించనున్నారు.



నేడు పద్యానికి పట్టాభిషేకం ర్యాలీ..

వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9.30 గంటలకు టిటిడి పరిపాలనా భవనం నుంచి యశోదనగర్‌లోని విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున పేర్కొన్నారు. తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఇప్పటికే వేమన పద్యాలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పోటీలను నిర్వహించినట్లు గుర్తుచేశారు. తిరుపతిలో వేలాదిమంది విద్యార్థులు వేమన పద్యాలను కంఠస్తం చేసి నేటి సమాజ స్థితిగతులకు అన్వయం చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా వేలాదిమంది విద్యార్థులు 'వేమన పద్యాలను ప్రదర్శిస్తూ విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. కవులు, రచయితలు, లలిత- జానపద కళలకు, విద్యా- వైజ్ఞానిక, శాస్త్రీయ ఆలోచనలను పెంచే కేంద్రంగా వేమన విజ్ఞానకేంద్రం నిలవబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో తిరుపతి వాసులందరూ పాల్గొనాలని నాగార్జున పిలుపునిచ్చారు.



సిపిఎం ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి

4న జిల్లాకు బస్సు జాతా



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి కార్యక్రమం జరుగుతున్నదని దీన్ని జయప్రదం చేయాలని సిపిఎం ప్రజాప్రణాళికను శనివారం పలమనేరు సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణ భేరి జయప్రదం చేయడానికి జిల్లాలో నవంబర్ 4న బస్సు జాతా వస్తున్నదని ఘనంగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రజలందరినీ కలవరపరుస్తున్నాయని అన్నారు. ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని ఎదురు చూసే కన్నా మన బతుకులను రాష్ట్ర భవిష్యత్తును సక్రమంగా నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రాన్ని విడగొట్టి 10 సంవత్సరాలు పూర్తికావస్తోంది అప్పుడు మనకు అరచేతులో స్వర్గం చూపించారని అన్నారు. కేంద్రంలోని బిజెపి నాయకులు ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి హామీలు ఇచ్చి ఈ ఒక్కటి కూడా హామీలు అమలు కాలేదని అన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివద్ధి కోసం సిపిఎం ప్రజారక్షణ భేరి కార్యక్రమం నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం ప్రజాప్రణాళికను ప్రజలు ముందు ఉంచిందని, కరెంట్ యూనిట్ రూపాయికే, పేదలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా, స్మార్ట్ మీటర్లు వద్దు, ఛార్జీలు రద్దు చేయాలని, రూ.400లకే గ్యాస్, రూ.60లకే లీటర్ పెట్రోల్, డీజిల్, ఇసుక ఉచితం, అందరికీ సంక్షేమం పెన్షన్, రేషన్‌కార్డులు, అన్ని రకాల పెన్షన్లు రూ.5వేలు, పేదలకు రెండు సెంట్లు ఇల్లు, ఐదు లక్షల ఆర్థిక సాయం, 40 వేల టీచర్లకు మెగా డీఎస్సీ, 2 లక్షల 50 వేల ప్రభుత్వ ఖాళీ పోస్టులు, నిరుద్యోగ భృతి నెలకు రూ.5వేలు, ఓపీఎస్ పునరుద్ధరణ, ప్రైవేటు ఉపాధ్యాయులు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, భూమిలేని వ్యవసాయ కూలీలకు కౌలు రైతులకు రెండు ఎకరాల భూమి, అసలు పట్టాదారులకే అసైన్మెంట్ భూముల హక్కులు కల్పించడం, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 200 రోజులు, పని గ్యారంటీ అసంఘటితరంగా కార్మికుల కనీసం 26,000, సమగ్ర సంక్షేమ చట్టం స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, రైతులు గిట్టుబాటు ధర కల్పించడం లాంటి ప్రజా ప్రణాళికను సిపిఎం విడుదల చేసిందని తెలిపారు. ప్రజారక్షణ భేరి జయప్రదం చేయడానికి నవంబర్ 4న జిల్లాకు వస్తున్న బస్సు జాతాను జిల్లాలోని ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సిపిఎం నాయకులు ఓబులురాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, నాయకులు ఈశ్వరయ్య, అంజి, ధనలక్ష్మి సరోజమ్మ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విశాఖ ఉక్కు ఆత్మగౌరవాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడితే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లం రాజేంద్రప్రసాద్, బండి చలపతిలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. శనివారం చిత్తూరు నగరంలోని పలు విద్యాసంస్థలలో నవంబర్ 8 తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ప్రచార సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి, యువజన నాయకులు 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకుండా జరుగుతున్న ఆత్మగౌరవ పోరాటం నవంబర్ 8 నాటికి 1000 రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలకు పిలుపునిచ్చామని అన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కమిషనర్



జగనన్న గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహనిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధింత అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని, నవంబర్ నెలలో పూర్తి చేయాల్సిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆమేరకు రోజువారి పనులు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు, నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా పనులు ప్రారంభించి నిలిపివేసిన లబ్ధిదారులను గుర్తించి, వారికిఅవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. వార్డు సచివాలయం స్థాయిలో ఉదయం నీటి సరఫరా తీరు, సాయంత్రం వీధిలైట్ల నిర్వహణ కచ్చితంగా పరిశీలించి రోజువారి వివరాలు సమర్పించాలన్నారు. కన్సిస్టంట్ రిథమ్ యాప్, జగనన్న ఆరోగ్య సురక్ష, పౌర సేవలు, పన్నుల వసూలు, నిర్దేశించిన రోజువారి విధి నిర్వహణాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ డీఈ గురురాజన్, ఏఈ శ్రీధర్, సీఎంఎం గోపి, ఏసిపీ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్పి శాఖలను తనిఖీ చేసిన ఛైర్మెన్



జెడ్పి కార్యాలయ శాఖలను తనిఖీ చేస్తున్న ఛైర్మెన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా పరిషత్ కార్యాలయ పరిధిలోని అన్ని శాఖలను జెడ్పి ఛైర్మెన్ శ్రీనివాసులు, సిఈఓ ప్రభాకర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ద్వారా చేపడుతున్న కారుణ్య నియామకం ఫైల్స్‌ను త్వరితగతిన తయారు చేయాలన్నారు. అలాగే ప్లానింగ్ సెక్షన్‌లో పనుల మంజూరు, వర్క్ బిల్లుల స్క్రూట్నీ, బిల్లుల చెల్లింపులు, కోర్ట్ ఫైల్స్ సకాలంలో తయారు, జడ్పీ పిఎఫ్ సెక్షన్స్‌లో ఉద్యోగుల, టీచర్స్ చందా వివరాలను మాన్యువల్‌గా తయారుచేసి లోన్స్ త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఇంజనీరింగ్ ఆఫీసు పైభాగంలో చెట్లు మొలవడాన్ని గమనించి చెట్లను వెంటనే తీసివేయాలని సూచించారు. అలాగే ఇంజనీరింగ్ డివిజన్ ఆఫీసులలో వర్క్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని, ఆన్లైన్‌లో బిల్లులు చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరై, విధులను సక్రమంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. అనతరం తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ ఎస్సీ, డీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించి నిర్మాణంలో ఉన్న అన్ని రకాల పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఛైర్మెన్, సీఈఓతో పాటు వైస్ ఛైర్మెన్ రమ్య, స్టాడింగ్ కమిటీ ఛైర్మెన్ భారతి వివిధ జెడ్పి శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి బోరును ప్రారంభించిన ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ బండపల్లిలో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. నగర పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

అపోలో, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా చిత్తూరు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కొరకు ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్‌లో ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుంచి నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని, ఇందులో భాగంగా శనివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఈసారి అపోలో డాక్టర్లచే పోలీసు సిబ్బంది, విశ్రాంత సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కొరకు ఏర్పాటు చేయటం జరిగిందని తెలియజేశారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, వారి డ్యూటీ సమయాలు కూడా చాలా భిన్నంగా ఉంటాయని, ఆహారం కూడా సమయానికి తీసుకోలేని పరిస్థితులు ఉంటాయని, విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజాభద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో వైద్యపరీక్షలు చేయించి, ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో నిత్యం ప్రజల సేవకే అంకితమైన పోలీస్‌సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. అందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించడానికి యోగ, ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం చిత్తూరులో లయన్స్ క్లబ్, జిల్లా వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ల పర్యవేక్షణలో పోలీసు శ్వేదమహిళల బ్యారక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన శిబిరానికి తరలి వచ్చిన పోలీసులకు వీరితో పాటు అడిషనల్ ఎస్పి ఏఆర్ జి.నాగేశ్వరరావు రక్తదానం చేసి, రక్తదానం చేసిన పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి పోలీస్ ఉన్నతాధికారులు నాగేశ్వరరావు, డిఎస్పీ శ్రీనివాసమూర్తిలతో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలి

పాత నేరస్తులపై గట్టి నిఘా- నెలవారీ నేరసమీక్షలో జిల్లా ఎస్పి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలి, పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచి సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో ప్రజలకు పడకుండా అప్రమత్తం చేయాలని శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేరసమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణ నేరస్తులపై ఉక్కుపాదం మోపండి.. పిడి యాక్ట్‌లు ప్రయోగించాలన్నారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో ఎస్పీ జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేరసమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ రాబోవు ఎన్నికల దృష్ట్యా ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుండే సిద్ధంగా ఉండాలని ఎన్నికలు సజావుగా సాగేందుకు గల విషయాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. బెట్టింగ్ మాఫియ ను అంతమొందించడమే లక్ష్యంగా పనిచేయాలని, బెట్టింగ్.. సరదాగా మొదలవుతున్న ఈ జాడ్యం.. తరువాత వ్యసనంగా మారుతోందన్నారు. బెట్టింగ్‌కి అలవాటుపడ్డ యువకులు దానికోసం ఎందాకైనా అప్పులు చేస్తున్నారు. తరువాత తీసుకున్న అప్పు కట్టలేక ప్రాణాలను సైతం బలితీసుకుంటు కన్నా వాళ్లకి తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. పోలీసు అధికారులు అందరు బెట్టింగ్‌ను అడ్డుకోవాలని తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్, 102 కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేరనియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. జైలు నుండి విడుదలైన పాత నేరస్థులపై నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.

యాత్రల జాతర

వీధుల్లో అధికార, ప్రతిపక్షాల హోరు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

అధికార వైఎస్‌ఆర్‌సిపి, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీలు ఎన్నికల జాతరకు తెరలేపాయి. పోటాపోటీగా యాత్రల పేరుతో వీధుల్లో హోరెత్తిస్తున్నాయి. ఆధ్యాత్మిక నిలయమైన తిరుపతిని అందుకు వేదికగా చేసుకున్నాయి. ఇరుపక్షాలు హేమాహేమీలను పిలిపించి, సభలు, ర్యాలీలు నిర్వహించి, తాము గొప్పంటే తాము గొప్పంటూ ఉపన్యాసాలకు దిగడం గమనార్హం.

2024 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అంతా సవ్యంగా సాగితే కాలపరిమితి పూర్తయ్యే వరకు వైసిపి అధికారంలోనే ఉంటే 2024 ఏప్రిల్, మే నెలలో ఎన్నికలు జరుగుతాయి. అధికారపార్టీ ముందస్తు ఎన్నికలకు వెళ్లితే, జనవరి, ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వైసిపి ప్రభుత్వం గడువు పూర్తయ్యే వరకు ఎన్నికలకు వెళ్లేలా లేదు. కానీ ఏది ఏమైన మరో ఆరేడు నెలలో ఎన్నికల పందెర ప్రారంభమవుతోంది. అంతకు ముందే ప్రజలను మెప్పించేందుకు, ఓటర్లను మభ్య పెట్టేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుని స్కిల్ కుంభకోణంలో సిఐడి అరెస్టు చేసి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించింది. సుమారు 45 రోజులకు పైగా చంద్రబాబు లాయర్లు అటు ఏసిబి కోర్టు, హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టుల చుట్టు బెయిల్ కోసం తిరుగుతూనే ఉన్నారు. టిడిపి అధినేత అరెస్టు కావడంతో అధికారపార్టీ తిరుగులేదని భావించింది. కానీ అన్యూహంగా చంద్రబాబు కుటుంబ సభ్యులను రంగంలోకి దింపడంతో అధికారపక్షం ఖంగుతింది. చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తానే స్వయంగా బస్సు యాత్రకు తెరలేపింది. చంద్రబాబు అరెస్టు వల్ల చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను పరామపర్శించే పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు మరో యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే నారాలోకేష్ చేస్తున్న యువగళం యాత్ర తాత్కాలికంగా బ్రేక్ పడడంతో భువనేశ్వరి యాత్ర ఇప్పుడు కార్యకర్తలకు, నాయకులకు నూనత ఉత్సాహాన్ని ఇస్తుందని భావించారు. అనుకున్నదే తడవుగా తిరుపతి కేంద్రంగా నిజం గెలవాలి పేరుతో భువనేశ్వరి యాత్రను ప్రారంభించారు. మొదటిగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తమ సొంతూరైన నారావారిపల్లికి చేరుకుని అక్కడ నుంచి ఈనెల 25 యాత్రను ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఐతేపల్లి సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించి చంద్రబాబు ఏ తప్పు చేయలేదని, ఉద్దేశపూర్వంగానే అరెస్టు చేశారని విలపించారు. కోటేశ్వర్లయిన తాము కోటికి రెండు కోట్లకు కక్కుర్తి పడాల్సిన పనిలేదని, బాబు జీవితం అంతా ప్రజల కోసంమేనని వివరించారు. అక్కడ నుంచి ప్రారంభమైన ఆమె యాత్ర తిరుపతి, శ్రీకాళహస్తి మీదగా సాగింది. నారా భువనేశ్వరి యాత్రతో అధికార పార్టీల్లోనూ ఊపొచ్చింది. సామాజిక సాధికరాత పేరుతో 27వ తేదీ శుక్రవారం తిరుపతి నగరంలో బస్సుయాత్రకు తెరలేపారు. వైసిపి అనుబంధ సంఘాల సమన్వయకర్త విజయసాయిరెడ్డి రాకతో ఆయన సూచనల మేరకు బస్సు యాత్రను కాస్త పాదయాత్రగా మార్చారు. మదనపల్లి, చిత్తూరు వైపు నుంచి తిరుపతికి వచ్చే మార్గంలో ప్రధాన కూడలి అయిన జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి యాత్రను ప్రారంభించారు. వేలాది మంది కార్యకర్తలు, నాయకులతో తిరుపతిలోని 50 డివిజన్ల మీదగా సుమారు 17 కిలోమీటర్ల పొడవు ఉదయం నుంచి రాత్రి వరకు యాత్రను నిరంతరాయంగా కొనసాగించారు. జగన్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యమని, అన్ని మతాలు, కులాలకు వైసిపి ప్రభుత్వంలోనే మంచి జరుగుతోందని చెబుతూనే 2024లో జరగబోవు ఎన్నికల్లో తిరుపతి వైసిపి ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీపడబోతున్న భూమన అభినయ్‌రెడ్డిని గెలిపించాలని ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, ప్రజలకు వేడుకున్నారు.

గత మూడు రోజులుగా తిరుపతి జిల్లాలో సాగిన అధికార, ప్రతిపక్ష పార్టీల యాత్రులు కేవలం ఎన్నికల దృష్టిలో పెట్టుకునే జరిగాయని ప్రజలే బహిరంగంగా చర్చించుకున్నారు. మరోపక్క భూర్జువ రాజకీయ పార్టీలకు భిన్నంగా వామపక్ష పార్టీలు రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలు, మతం పేరట, కులం పేరుతో పెట్రేగుతున్న ఉన్మాదతత్వం, సనాతన ధర్మం పేరుతో మహిళలపై జరుగుతున్న దారుణాలను గొంతెత్తి వివరిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు పెట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పూనుకుంది. అనేక ప్రాంతాల్లో సమావేశాలు పెట్టి భూర్జువ ప్రభుత్వాలు సాగిస్తున్న దారుణాలను వివరిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువులను కాపాడాలని, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నినాదిస్తున్నారు. అందులో బాగంగా నవంబరు 15న ఛలో విజయవాడ పేరుతో ప్రజారక్షణ భేరికి నడుంబిగించారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అనునిత్యం వారు పడే ఇబ్బందులను పసిగట్టి, ప్రతి సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు మేలు చేయాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు, నిరహార దీక్షలు, ర్యాలీలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై వాస్తవాలను వివరిస్తున్నారు. మహిళా సాధికారితకు, సమసమాజనిర్మాణానికి వారు చేస్తున్న పోరాటాలు ప్రజల్లో చర్చనీయాంశం చేస్తున్నాయి. ఎన్నికలతంతు కాదు ఎల్లప్పుడు ప్రజాసమస్యలపైనే పోరాటం అంటూ ముందుకెళ్ళుతున్నారు. ఇది భూర్జువ రాజకీయ పార్టీలు, వామపక్షాలకు ఉన్న తేడా అంటూ ప్రజలే ప్రశంసింస్తుండడం గమనార్హం.





వైసిపి సామాజిక సాధికార యాత్రలో భూమన

బాల్యవివాహాలను నియంత్రించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలను నియంత్రించేందుకు అనేక చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో బాల్య వివాహాల నియంత్రణపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధ్యక్షతన ఐసిడిఎస్, ఇతర సంబంధిత శాఖలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావ్ మాట్లాడుతూ బాలల సంరక్షణకు బాల్య వివాహాల నియంత్రణకు బాలల హక్కుల కమిషన్ కృషి చేస్తోందని, దాదాపుగా 14 సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళ్ళడం ద్వారా బాల్యవివాహాలను అరికట్టేందుకు సులువు అవుతుందన్నారు. బాల్యవివాహాల అరికట్టుటకు ఏర్పాటు చేసిన చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. బాల్యవివాహాల నియంత్రణపై జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ, మండలలో సచివాలయాల స్థాయిలో నవంబర్ 1 నుండి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. 2030 నాటికి సున్నా శాతం బాల్యవివాహాలు నమోదు దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహాలపరంగా మన జిల్లా 6వ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో బంగారుపాళ్యం, కుప్పం, బైరెడ్డిపల్లి, వి.కోట, పలమనేరు, కుప్పంలో, దీనితో పాటు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ప్రాంతాలలో బాల్య వివాహాలు ఎక్కువ శాతం నమోదవుతున్నాయని తెలిపారు. ఆ ప్రాంతాలలో దాదాపు 3 నెలలు చట్టంపై అవగాహన కల్పిస్తే బాల్య వివాహాలను అరికట్టవచ్చునని తెలిపారు. జెడ్పి సీఈఒ ప్రభాకర్‌రెడ్డి, దిశా డిఎస్పీ బాబు ప్రసాద్, ఐసిడిఎస్ పీడి నాగశైలజ, డిఆర్డిఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, చిత్తూరు, పలమనేరు ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, తహశీల్దార్లు, ఐసిడిఎస్ సిడిపిఓలు మహిళా పోలీసులు (ఎంఎస్‌కెలు) సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



పుష్పాంజలి ఘటిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యం లో పేరెన్నికగల ఆదికవి అని జిల్లా కలెక్టర్ షన్మోహన్ కొనియాడారు.శనివారం వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జిల్లాసచివాలయంలోని స్పందన హల్ నందు వాల్మీకి మహర్షి చిత్ర పటానికి జిల్లా కలెక్టర్,డి ఆర్ ఓ ఎన్.రాజశేఖర్ ఘనంగాపుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ.. మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని,అంతటి మహా కావ్యం ను రచించిన మహాకవి, ఆదికవి వాల్మీకి అని తెలిపారు.వాల్మీకి మహర్షిని ఆదికవి, భార్గవుడు, కవికోకిల, వాక్యావిశారదుడు, మహాజ్ఞాని, భగవాన్ అని కూడా పిలుస్తారన్నారన్నారు. మహనీయుల జీవితాన్ని మనం ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడిచి జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి పద్మ నాభం,బిసి సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

పెద్దపంజాణి: మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సొంత నిధులతో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ పాల్గొని ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ మహా కావ్యాన్ని లిఖించి అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎంపిపి రెడ్డెప్ప, జెడ్పిటిసి సుష్మకీర్తి, వైసిపి నాయకులు బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జడ్పీ ఆఫీస్ నందు వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి జెడ్పి ఛైర్మెన్ శ్రీనివాసులు, సిఈ ఒ ప్రభాకంరెడ్డిలు నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్పర్సన్ రమ్య , జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి మధు కుమారి జిల్లా పరిషత్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని పత్తికొండ గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ రవినాయుడు, నాయకులు రాజన్న, హరిబాబు, సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్, ఉపాధ్యాయులు గురునాథం, రవి, వేణు, రమేష్ పాల్గొన్నారు.



విగ్రహ అవిష్కరణ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

సోమల: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండలంలోని ఆవులపల్లిలో ఘనంగా వేడుకలు జరిగాయి. వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పుంగనూరు: పట్టనంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరా సర్కిల్లో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో విగ్రహనికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఎంపీ భాస్కర్‌రెడ్డి, వాల్మీకి సంఘ నాయకులు అద్దాలు నాగరాజు, డాక్టర్ శివ, విశ్రాంత డిఎస్పి సుకుమార్‌బాబు, రాజశేఖర్, ఏఎంసి చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోనీ బాపలనాత్తం గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, నాయకులు జయకుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు ప్రభుత్వ కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శనివారం చిత్తూరు రూరల్ మండలం పెదిశెట్టిపల్లి సచివాలయంలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో నగర పాలక సంస్థ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రజలందరి ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిపి అమరావతి అన్నారు. మండలంలోని జంబు వారిపల్లిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సోమ శేఖర్, సర్పంచ్ అమరావతి, కుమారి, సింగిల్ విండో ఛైర్మన్ దత్తురెడ్డి, ఎంపిటిసి మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమల: సదుం మండలంలోని 10 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని వెజ్జుపల్లి పంచాయతీలో సర్పంచ్ హరి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఎండివో శ్రీదేవి, డిటి తులసిరాం, డాక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పనులు అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-గంగవరం: తమకు నష్ట పరిహారం చెల్లించాకే హంద్రీనివా కాలువ పనులు చేపట్టాలని రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని గుండుగల్లు పరిధిలో కాలువ పనులు చేపట్టేందుకు వచ్చిన కాంట్రాక్టర్లను శనివారం రైతులు అడ్డుకున్నారు. సాగు చేసుకుంటున్న పంటలను వదుకొని కాలువకు భూములు ఇచ్చామని, అయితే నష్ట చెల్లించకుండా ఎలా పనులు చేస్తారంటూ కాంట్రాక్టర్లను నిలదీశారు. దీంతో సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డాక్టర్ శ్రీహరిపై విచారణ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఒగా పని చేసి డాక్టర్ శ్రీహరి ఉద్యోగ నియామకాల్లో అవినీతికి పాల్పడారని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు పిర్యాదులతో శనివారం కర్నూలు డిఎంఅండ్‌హెచ్‌ఒ రామగిడయ్య ను విచారణ అధికారిగా నియమించారు. రామగిడ్డయ్య శనివారం చిత్తూరు డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం చేరుకొని పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పిర్యాదుదార్లతో చర్చించారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం ముఖ్య నాయకుల పేర్లతో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు పిర్యాదు చేశారు. అయితే పిర్యాదు చేసిన వారు మాత్రం ఆ పిర్యాదుతో తమకు సంబందం లేదని తాము ఎలాంటి పిర్యాదు చేయలేదని విచారణ అధికారికి తెలియజేశారు.

మహాప్రస్థానం వాహనాలు, ఫ్రీజర్ బాక్సుల వితరణ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఎపిఎస్ ఆర్‌టిసి వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి శనివారం స్థానిక కొంగారెడ్డిపల్లిలోని తన కార్యాలయం వద్ద పేదల కోసం చిత్తూరు నగర వాసులతో పాటు పరిసర ప్రాంతాల వారి కోసం ఉచితంగా మహాప్రస్థానం (చివరి సంస్కారం) కోసం వాహనాలు, ఫ్రీజర్ బాక్సులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు దహన సంస్కారాలు చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పేదల సేవ కోసం మహా ప్రస్థానం వాహనాలు, ఫీజర్ బాక్సులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైకాపా కార్పోరేటర్లు, అమ్మఒడి నిర్వహకులు పాల్గొన్నారు.



ఫ్రీజర్ బాక్సులు అందిస్తున్న విజయానందరెడ్డి

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-నగరి: నింద్ర మండలంకి చెందిన టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. నగరి మంత్రి ఆర్‌కె రోజా శనివారం వీరికి కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. నింద్ర ఎంపిపి దీప ఆధ్వర్యంలో ఎలకటూరు గ్రామస్తులు 40కుటుంబాలు నగరి మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు ముత్తమ్మ, విక్రమ్, ప్రియా, మునస్వామి, నందిని, సొరకాయలు, వేద మాణిక్యం, సోము, లక్ష్మి, కాంతారావు, వనజ, చిన్నమ్మాయి, సుందరరాజులు తదితరులు ఉన్నారు. నమ్మకంతో పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నింద్ర వైస్ ఎంపీపీ శోభ, నాయకులు వేణురాజు, బాబురెడ్డి, విజేష్, మునికష్ణారెడ్డి, సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



భవ్యశ్రీ కుటుంబానికి న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: భవ్య శ్రీ కుటుంబానికి న్యాయం చేస్తామని డి-నోటిఫైడ్, సంచార మరియు సెమీ సంచార కమ్యూనిటీల అభివృద్ధి మరియు సంక్షేమ బోర్డు సభ్యుడు భరత్‌భాయ్, బాబుభాయ్ పట్నీ పేర్కొన్నారు.శనివారం రాత్రి పెనుమూరు మండలం,వేణుగోపాల్ పురం గ్రామానికి చెందిన (గత మాసంలో అనుమాన స్థితిలో మతి చెందిన) భవ్యశ్రీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవ్యశ్రీ మతి సంఘట కు సంబంధించి భవ్యశ్రీ తల్లిదండ్రుల ను అడిగి వివరాలను తీసుకుకున్నారు. మీకు న్యాయం చేస్తామని వారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలయ్య, ఎస్సై ఎం. అనిల్ కుమార్, తహశీల్దార్ కళావతి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్న, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎస్.మూర్తి,సంచార జాతుల సంఘం సభ్యులు పి.కుమార్ మహీంద్ర, చిత్త రంజ న్, డోల కష్ణ, డాక్టర్ ఫణీంద్ర, మధుసూదన్, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



భవ్యశ్రీ తల్లితో మాట్లాడుతున్న డిడబ్ల్యూబిడిఎన్‌సిఎస్ సభ్యులు

నా భూమి నాకు ఇప్పించండయ్యా



విలేకరులతో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: తమ భూమికి అక్రమ పట్టాలు పొంది హక్కుదారులైన తమను భూమిలో అడుగు పెట్టన్వికుండా చేస్తున్నారని పెనుమూరు మండలం కలిగికి గ్రామ పంచాయితీ గొల్లప్లిలకు చెందిన సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 10 బార్ 1 ఎలో 3.61 సెంట్ల సాగు భూమి 1968లో తమ పూర్వికులకు మంజురు చేశారని ఈ భూమిని ఆదే గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు నకిలీ పట్టాలను సాధించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. రెవిన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అసంపూర్తి భవనాలు పూర్తిచేయరేం?

- జనసేన నేతల డిమాండ్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఎప్పుడు పూర్తి చేస్తారని గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పొన్నా యుగంధర్ సతీమణి స్రవంతి డిప్యూటి సిఎంని డిమాండ్ చేశారు. మండలంలోని పచ్చి కాపల్లంలో శనివారం ధర్మరాజుల ఆలయంలో పూజలు చేసిన అనంతరం 'జనం కోసం జన సేన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవంతి మాట్లాడుతూ వెదురుకుప్పం మండలంలో డిగ్రీ కళాశాల, ఐటిఐ భవనం, ఫైర్ స్టేషన్ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా డిప్యూటి సిఎం నారాయణస్వామి చర్యలు తీసు కోలేదని ఆరోపించారు. ప్రధాన రహదారులో రోడ్డు ప్ర మాదాలు జరుగుతుండటం బాధాకరమన్నారు. కార్వేటినగరం – పచ్చికాపల్లం, వెదురుకుప్పం – దేవళంపేట మీదుగా కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి ఎంటో చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పురుషోత్తం, సతీష్, యతీశ్వర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, భాను చంద్రరెడ్డి, శ్రీనివాసులు, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందాలంటే ఈ క్రాఫ్ తప్పనిసరి

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని యండి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహన్ ప్రియ ఆధ్వర్యంలో ఈ పంట నమోదు సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏర్పేడు మండల వ్యవసాయ శాఖ అధికారి షణ్ముఖం హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన ప్రియ మాట్లాడుతూ రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు అందాలన్నా, మద్దతు ధరలకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నా, ఉచిత పంటల భీమా రావాలన్నా, పంటల నష్టపరిహారం పొందాలన్నా ఈ పంట నమోదు తప్పనిసరి గ్రామంలోని ప్రతి రైతు బాధ్యతగా ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ శాఖ అధికారి షణ్ముఖం మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు ఈ పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించి , మిగిలిన రైతులు ఈ పంట నమోదు ఈనెల 29వ తేదీ నాటికల్లా తప్పనిసరిగా నమోదు చేసుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లోకముని , అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గడపగడపలో సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శనివారం పట్టణంలోని 3వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. తమ సమస్యలను అర్జీల రూపంలో తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారం కోసమే సీఎం జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్ళీ గెలిపించాలని కోరారు.

ఎంపిడివో శ్రీదేవికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల ఎంపిడివో శ్రీదేవికి డివిజనల్ డెవెలప్మెంట్ ఆఫీసర్(డిఎల్‌డివో)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా చిత్తూరు జెడ్పి సీఇవో ప్రభాకర్‌రెడ్డి నుంచి ఉత్తర్వులను అందుకున్నారు. పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

విశ్రాంత హెచ్‌ఎంకి పరామర్శ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కసవనూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మిట్టపల్లి రంగారెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైసిపి నేత నూకతోటి రాజేష్ శనివారం పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో కార్వేటినగరానికి చెందిన భూపతిరాజు కుటుంబ సభ్యులు శనివారం స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్ వీరిని అభినందించారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాయితీపై రైతులకు అందజేస్తున్న ఎరువులను ఆర్‌బికెలలో అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసుదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సెట్టేరి ఆర్‌బికెలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, అందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రరెడ్డి, అధికారులు మురళికృష్ణ, చిట్టిబాబు, సాదరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంచేందుకు కృషి

ప్రజాశక్తి-కార్వేటినగరం: పాల ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిడివో మోహన్‌మురళి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాల వెల్లువ కార్యక్రమంపై శిక్షణా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాల వెల్లువ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం, ప్రభుత్వం పాడి రైతులకు కల్పిస్తున్న రుణ సౌకర్యాలు, వెసులుబాటును వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, సంఘమిత్రలు, వలంటీర్లు కృషి చేయాలని సూచించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామకృష్ణ(52) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఉదయం పాఠశాలకు బయలుదేరిన సమయంలో చాతిలో నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. రామకృష్ణ చౌడేపల్లిలో ఇంగ్లీష్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల ఎంఈవో కేశవరెడ్డి, హెచ్‌ఎం నాగరాజరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని గుట్టూరు తండాకు చెందిన త్యాగరాజనాయక్ శనివారం అకస్మాత్తుగా మృతి చెందారు. టిడిపి, వైసిపి నేతలు వేర్వురుగా వచ్చి నివాళులు అర్పించారు. తలో రూ.10వేలను ఆర్థిక సాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని తేజస్విని రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. శనివారం వివరాలను ఉపాధ్యాయులు మల్లీశ్వరి తెలిపారు. తేజస్వినిని పలువురు అభినందించారు.

'ఆర్టీసీ డ్రైవర్‌పై అధికార పార్టీ నేత దాడి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నెల్లూరు జిల్లా కావలి సమీపంలో ఆర్టీసీ డ్రైవర్‌పై అధికారపార్టీకి చెందిన వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న టిడిపి చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడిలో గాయపడ్డ ఆర్టీసీ డ్రైవర్‌కు న్యాయం చేసేలా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారం కోసం శనివారం కొంగారెడ్డిపల్లిలో హెచ్.మాలిక్ అధ్యక్షతన ఆటోడ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాలిక్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు లైసెన్సులు ప్రభుత్వం రుసుంతో ఇవ్వాలని, ఆటోలకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ ధరలు 30 శాతం తగ్గించి ఇవ్వాలని కోరారు. తమ సమస్య పరిష్కారం కోసం ఆటోడ్రైవర్లు అందరూ ఐక్యమత్యంతో ఉండాలన్నారు. సమావేశంలో చిత్తూరు ఆటోడ్రైవర్లు రఫీ, గోపి, కుమార్, రియాజ్, షాజహాన్, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపరికరాలు వితరణ



క్రీడా పరికరాలతో పాఠశాల బాలికలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: జాయినిండ్ దడాట్స్ బెంగుళూరు వారు రూ. 50 వేల క్రీడా పరికరాలను కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందించారు. ముఖ్యంగా బాలికలు క్రీడల్లో రాణించాలనే ఉద్ధేశంతో క్రీడా పరికరాలను అందించిన్నట్లు దాతలు పెర్కొన్నారు. అండర్ 19 ఫెన్సింగ్ విభాగంలో సిద్ధంపల్లిలో నిర్వహించిన పోటీల్లో నలుగురు బాలికలు జిల్లా జట్టుకు ఎంపిక కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని రాష్ట్ర స్థాయిలో పోటీల్లో కూడా పాల్గొంటారని వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ రాఘవ, కార్తిక్‌లను అభినందించారు. క్రీడా పరికరాలను అందించిన వారికి హెచ్‌ఎం చంద్రశేఖనాయుడు, పిడిలు నాగరాజ, మహారాణి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ దీక్ష



రిలే నిరాహార దీక్ష చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాజీ సిఎం చంద్రబాబును అక్రమ కేసులు పెట్టి జైలు పంపడం దారుణమని చిత్తూరు జిల్లా సర్పంచ్ సంఘ అధ్యక్షులు కోక ప్రకాష్‌నాయుడు అన్నారు. శనివారం బంగారుపాళ్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఆయన మట్లాడుతూ చెయ్యని నేరానికి అన్యాయంగా చంద్రబాబును జైలు పంపారని ఖండించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జనార్థన్ గౌడ్, నాయకులు లోకనాథంనాయుడు, అమరనాథ్, సూరి, మోహన్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కారుతో సహ ఎర్రచందనం స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనం కారు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల క్రాస్ వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారులో 13దుంగలు గుర్తించి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలియవచ్చింది. అన్నమయ్య జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-నగరి: సత్రవాడలో కరివరదరాజ ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శుద్దిచేసి శ్రీదేవి, భూదేవి సమేత కరివరదరాజ స్వామికి హోమాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు ఆ తరువాత విశేషంగా అభిషేకం చేశారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. మంత్రి ఆర్‌కె రోజ పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం

ప్రజాశక్తి-నగరి: ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు నగోమి అధ్యక్షతన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోదండయ్య మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31వ తేదీన ముంబై నగరంలో ఏఐటీయూసీ స్థాపించబడిందన్నారు. 104 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ నెల 31వ తేదీన జిల్లా వ్యాప్తంగా జెండాలు ఎగరేసి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగరి పట్టణ సీనియర్ నాయకులు వేలన్, భాష, మురళి, శేఖర్, విజయ్ కుమార్, సతీష్, చంద్మామరై, విజయలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో ఆదరించండి'

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ థామస్ కోరారు. శనివారం మండలంలోని కోటగరంలో మిని మ్యానిఫెస్టోను వివరించారు. టిడిపి అధికారంలో వస్తే చేపట్టబోయె సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, కోదండరెడ్డి పాల్గొన్నారు.

బేస్‌బాల్ కు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ లో సోమవారం 9 గంటలకు స్కూల్ గేమ్స్ లో భాగంగా బేస్ బాల్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఎంపిక జరుగుతుందని పాంశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవుల నాయుడు తెలిపారు. ఈ ఎంపిక పోటీలు స్కూల్ గేమ్స్ చిత్తూరు ఉమ్మడి జిల్లా సెక్రటరీలు బాబు, సురేష్, విజయకుమారి, వసంత ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే బాలబాలికలు తమ సొంత క్రీడా పరికరాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93900 93145 ,6300112569 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అలిపిరి–కపిలీతీర్థం మార్గంలోని దివ్యరామంలో ఆంధ్రప్రదేశ్ విశ్రాంత అటవీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ మారుతి హాస్పిటల్స్ కార్డియాలజీ విభాగ సేవలను డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో విశ్రాంత ఉద్యోగులకు గుండె సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించనున్నారని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత అటవీ ఉద్యోగులు, అటవీ సిబ్బంది, వాకర్స్, స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేస్తారన్నారు.

లైజన్ ఆఫీసర్ సెల్వంకు అభినందనలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి నూతన బిసి లైజన్ ఆఫీసర్ గా నియమితులైన ఉపకార్యనిర్వహణాధికారి సెల్వంను టిటిడి బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగులు శనివారం శాలువతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రవీంద్రబాబు, గంగరాజు కుమార్ యాదవ్, కామరాజు, గుర్రప్ప, దయాకర్, రూపేంద్ర, మునీంద్ర, సాయికుమార్, రఘుపతి, శంకరయ్య, లక్ష్మీపతి, వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ పై దాడి అమానుషం: సింధూజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎంతో బాధ్యతగా ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చే విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ పై అధికార పార్టీకి చెందిన నాయకులు ఖండకావరంతో భౌతిక దాడికి తెగబడి దాడి చేయడం అమానుషమైన చర్య అని, ఈ ఘటనకు బాధ్యులైన వారిని కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడిపి జోన్ ఫోర్ ఇన్చార్జి అంబూరు సింధూజ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగాలు చేసుకునే వారికి గాని, ఇళ్లలో ఉన్న వారికి గాని సరైన భద్రత కల్పించలేని పరిస్థితులు నేడు ఏర్పడ్డాయన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఓ బాధ్యత గల డ్రైవర్ పై అనుచితంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం ఏ మేరకు శిక్షలు ఉన్నాయో అన్ని దాడి చేసిన వారిపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులను నడిరోడ్డుపై ఉంచి డ్రైవర్ ను కిందకు లాగి ఇష్టం వచ్చినట్టు కొట్టి రక్త గాయాల పాలు చేశారని, అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలను రాష్ట్ర ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తమ ఫలితాలను వెల్లడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చంద్రబాబు విడుదల కావాలని మసీదులో ప్రార్థన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసిస్తూ నగరి నియోజకవర్గం పుత్తూరు టిడిపి ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ప్రసిద్ధి గాంచిన ముంబాయి హాజి అలీ దర్గా వద్ద ప్రార్థన చేశారు. చంద్రబాబుకి తొందరగా బెయిల్ రావాలని సుప్రీంకోర్టులో ఉన్న క్వాష్ పిటిషన్ కొట్టివేయాలని చంద్రబాబు ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ ప్రార్థన చేశారు. 24న ముఖ్య మంత్రి గా చంద్రబాబు , నగరి నియోజకవర్గంలో ఎంఎల్‌ఏగా భాను ప్రకాష్ అఖండ మెజారిటీ తో గెలవాలని మొక్కుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ హమీద్ బాషా, యూనస్ పాల్గొన్నారు.